పంజాగుట్ట ట్రాఫిక్ పీఎస్‌ను సందర్శించిన అడిషనల్ సీపీ

ఖైరతాబాద్, ఫిబ్రవరి 25 : పంజాగుట్ట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం అడిషనల్ సీపీ జోయల్ డేవిస్ సందర్శించారు. అడిషనల్ సీపీగా బాధ్యతలు తీసుకున్న డేవిస్ తొలిసారిగా పీఎస్‌కు వచ్చారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. ట్రాఫిక్ సిబ్బంది అనునిత్యం కూడళ్ల వద్ద ఉంటూ అంతరాయం కలుగకుండా చూడాలన్నారు. ట్రాఫిక్ పోలీస్‌గా ప్రజలకు సేవలందిస్తే మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. ఆయన వెంట ట్రాఫిక్ ఏసీపీ హరిప్రసాద్, సీఐ బోసుబాబు, సిబ్బంది ఉన్నారు.

హైకోర్టు ప్రాంగణంలో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

హిమాయత్ నగర్ , ఫిబ్రవరి 25: భారత రాజ్యాంగ నిర్మాత, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ప్రాంగణంలో ఏర్పాటు చేయాలని జాతీయ సమతా లాయర్స్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు పుట్ట పద్మారావు, ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ అడ్వకేట్ ఫోరం చైర్మన్ వడ్లమూరి కృష్ణ స్వరూప్‌లు కోరారు. ఈమేరకు మంగళవారం వారు హైకోర్టు చీఫ్ జస్టిస్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హైకోర్టులో అంబేద్కర్ విగ్రహంను ఏర్పాటు చేస్తామని 2024 స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా హైకోర్టు చీఫ్ జస్టిస్ హామీ ఇచ్చి పునాది వేయడం జరిగిందని తెలిపారు. త్వరలో విగ్రహం ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరేశ్, న్యాయవాదులు నరేంద్ర, నరసింహ, రమేశ్ పాల్గొన్నారు.

పరిస్థితులకు అనుగుణంగా మార్పుండాలి

- విధానాలు అమలు పర్చుకునేలా విద్యావ్యవస్థ ఉండాలి..
- ఆహార నాణ్యతకు మరింత ప్రాముఖ్యత ఇవ్వాలి..
- వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ జానయ్య

సమావేశంలో మాట్లాడుతున్న వీసీ జానయ్య

వ్యవసాయ యూనివర్సిటీ, ఫిబ్రవరి 25: సమాజంలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా, మన మార్పు ఉండాలని ప్రొ. జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వ విద్యాలయం ఉపకులపతి డా. జానయ్య అన్నారు. మంగళవారం వర్సిటీ సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ ఫ్యాకల్టీ ట్రైనింగ్ ఇన్ కమ్యూనిటీ సైన్స్ , పోస్టుగ్రాడ్యుయేట్ రీసెర్చ్ సెంటర్ 21 రోజుల పాటు నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా 'మానవుని మానసిక , పోషకాహార నాణ్యతలు, వ్యక్తిత్వ వికాసం పై ఉండే ప్రభావం' అనే అంశంపై మాట్లాడారు . సామాజిక , ఆర్థిక పరిస్థితులు, పట్టణీకరణ , వాతావరణ మార్పులు, కుటుంబ వ్యక్తిగత పరిస్థితుల వల్ల అనేక కొత్త సవాళ్లు ఎదురవుతున్నాయని అన్నారు. విధానాలు అమలు పర్చుకునేలా విద్యావ్యవస్థ ఉండాలని అన్నారు. ఏ వృత్తిలో ఉన్నా నిత్యం నేర్చుకునే అలవాటు ఉండాలన్నారు. తొలిసారిగా సెంటర్ ఫర్ హ్యూమన్ రీసోర్స్ డెవలప్‌మెంట్‌ను ఏర్పాటు చేశామన్నారు. మనిషి తమ బాధ్యతలు నిర్వర్తించుకుంటనే అవకాశాలు మరిన్నీ వస్తాయని అన్నారు. మన ఉమ్మడి కుటుంబ వ్యవస్థ కుప్పకూలడం వల్ల కూడా అనేక సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. నేటి ఆధునిక సమాజంలో వివిధ రకాల మా నసిక ఒత్తిళ్లకు లోనవుతున్నారని, వ్యక్తిగత వి కాసాన్ని , మానసిక స్థైర్యాన్ని పెంపొందించేవిధంగా ప్రాథమిక విద్యనుంచే నేర్పాలని అన్నారు. దేశంలో ఆహార నాణ్యతకు మరింత ప్రాముఖ్యత ఇవ్వాల్సి అవసరం ఉందన్నారు . టెక్నాలజీ అధికంగా వాడడం వల్ల వాటి చెడునే ఎక్కువగా ఆకర్షిస్తున్నారని హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం సెంటర్ ఫర్ హెల్త్ సైకాలజీ, డా. జి. పద్మజా అన్నారు . మనుష్యుల జీవిత కాలం పెరుగుతున్నా , నాణ్యత లేకుండా పోతుందన్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ కమ్యూనిటీ ఫ్యాకల్టీ డీన్ విజయ లక్ష్మి, డా. శ్రీదేవి, డా. సుప్రజ, జానకి శ్రీనాథ్, స్వరూపరాణి, వివిధ రాష్ట్రాల వ్యవసాయ, ఉద్యాన విశ్వవిద్యాలయ బోధ నా సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించిన కాంగ్రెస్ ప్రభుత్వం

సమావేశంలో మాట్లాడుతున్న ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్

హిమాయత్‌నగర్, ఫిబ్రవరి 25: రాష్ట్రంలో విద్యా వ్యవస్థను కాంగ్రెస్ ప్రభుత్వం భ్రష్టు పట్టించిందని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, రాష్ట్ర సహాయ కార్యదర్శి గ్యార నరేశ్ విమర్శించారు. మంగళవారం హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్ రెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ..ప్రభుత్వ విద్యను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తూ పేద, మధ్య తరగతి విద్యార్థులను చదువుకు దూరం చేస్తుందన్నారు. ఇంటర్ బోర్డు నిబంధనలు పాటించకుండా విద్యార్థుల తల్లి దండ్రులను మభ్యపెట్టి అక్రమంగా ముందస్తు అడ్మిషన్లు తీసుకుంటున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలను గుర్తించి వాటిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలు ఆకర్షణీయైన ప్రకటనలు చేస్తూ రాయితీల పేరుతో ముందస్తుగా అడ్మిషన్లు తీసుకుంటున్నా విద్యాశాఖ అధికారులు వాటిపై చర్యలు తీసుకోకుండా చోద్యం చూస్తున్నారని ఆరోపించారు. మార్కులు, ర్యాంకులే పరమావధిగా పోటీపడి ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలో సాగుతున్న చదువుల ఒత్తిడితో విద్యార్థులు అర్ధంతరంగా తనువు చాలిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పిల్లల భవిష్యత్తు బాగుండాలని ఎన్నో ఆశలతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆర్థిక భారాన్ని తమ భుజాలపై వేసుకుని చదివిస్తుంటే వారి తపన ఆదిలోనే మృగ్యమైపోతుందన్నారు. పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు , ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను తక్షణమే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో జరుగుతున్న విద్యా వ్యాపారానికి అడ్డుకట్టవేసి విద్యార్థులకు తగిన న్యాయం చేయాలని అన్నారు. ఈ సమావేశంలో ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర నేతలు సామిడి వంశీ, హరీశ్, లెనిన్, అరుణ్, అశ్విన్, వంశీ, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రాజుకుమార్ పటేల్

నిరుద్యోగులను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం

ఖైరతాబాద్, ఫిబ్రవరి 28: కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులను పూర్తిగా విస్మరించిందని కరీంనగర్, మెదక్, అదిలాబాద్, నిజామాబాద్ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థి, ఇండియన్ మెడికల్ కౌన్సిల్ సభ్యులు, తెలంగాణ గ్రాడ్యుయేట్స్ ఫోర్స్ వ్యవస్థాపకులు డాక్టర్ రాజ్‌కుమార్ పటేల్ అన్నారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఏడాదిన్నర కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై నిప్పులు చెరిగారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వేల ఉద్యోగాలిచ్చామని అబద్ధాలు చెబుతున్నారని, ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన జాబ్ క్యాలెండర్ ఏమైందని, రెండు లక్షల ఉద్యోగాలను ఏం చేశారని ప్రశ్నించారు. రాష్ట్రంలో విద్యా వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైపోయిందని, నిరుద్యోగం పెరిగి యువత అయోమయ పరిస్థితిలో ఉందన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీగా తాను ఎన్నికైతే మండలిలో ప్రభుత్వాన్ని ఎండగడుతానన్నారు. ఈ ఎన్నికల్లో కొన్ని బీసీ సంఘాలు ఒకే వ్యక్తికి మద్దతు పలుకుతున్నాయని, పైసలున్న వ్యక్తినే గెలిపించే ప్రయత్నం చేస్తున్నారని, ఆ చీకటి ఒప్పందం ఏమిటో, ఎంతకు అమ్ముడుపోయారో బహిర్గతం చేయాలన్నారు. ముఖ్యంగా ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్, బీసీ నేత చిరంజీవులు ఆ వ్యక్తికే మద్దతు పలకడంలో అంతర్యమేమిటని ప్రశ్నించారు. బీసీ మున్నూరు కాపు సామాజికవర్గానికి చెందిన వ్యక్తిగా ఆ నేతలకు తాను కనిపించడం లేదా అని ఆవేదన వ్యక్తం చేశారు. తాను ఎమ్మెల్సీగా ఎన్నికైతే నిరుద్యోగ, విద్యా వ్యతిరేక విధానాలను ఎండగడుతానన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ కృష్ణ ప్రియ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

10లో గ్రేడింగ్ విధానం యథావిధిగా ఉండాలి

సీఎం రేవంత్‌రెడ్డికి వినతి పత్రాన్ని అందజేస్తున్న ట్రస్మా ప్రతినిధులు

హిమాయత్ నగర్, ఫిబ్రవరి25: పదోతరగతిలో గ్రేడింగ్ విధానంను యథావిధిగా కొనసాగించాలని తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ (ట్రస్మా) ప్రతినిధి బృందం కోరింది. ఈ మేరకు మంగళవారం వారు సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్‌లను కలిసి వినతి పత్రాన్ని అందజేసింది. ఈ సందర్భంగా అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కందాల పాపిరెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె. అనిల్ కుమార్ , కోశాధికారి కె.శ్రీకాంత్‌రెడ్డిలు మాట్లాడుతూ.. బడ్జెట్ పాఠశాలల సమస్యల పరిష్కారం కోసం చర్చించేందుకు సమావేశాన్ని ఏర్పాటు చేసి.. బడ్జెట్ స్కూల్స్, కార్పొరేట్ స్కూల్స్, ఇంటర్నేషనల్ సూల్స్ మూడు కేటగిరీలుగా విభజించాలని కోరారు. తక్కువ ఫీజులు తీసుకుని మంచి ఫలితాలు సాధిస్తున్న బడ్జెట్ పాఠశాలలకు విద్యుత్, నీటి, ప్రాపర్టీ ట్యాక్స్ తగ్గించాలన్నారు. ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులు ఇచ్చి ఈ స్కూల్స్ లో పనిచేసే నాలుగో తరగతి సిబ్బందికి డబుల్ బెడ్ రూం ఇండ్లు ఇవ్వాలని కోరారు. దీనికి సీఎం రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించి బడ్జెట్ పాఠశాలల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా ముఖ్య సలహాదారుడు కె.అనంతరెడ్డి, అధికార ప్రతినిధి సి. రాంచందర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో నరేందర్‌రెడ్డిని ఓడించాలి..

హిమాయత్ నగర్, ఫిబ్రవరి25: కరీంనగర్, నిజామాబాద్, మెదక్, ఆదిలాబాద్ గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీచేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డిని ఓడించాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేక పోతుల నరేందర్ గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎర్ర శ్రీహరిగౌడ్ గ్రాడ్యుయేట్స్‌కు మంగళవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. నిరుద్యోగ యువత సమస్యలపై కనీస అవగాహనలేని నరేందర్ రెడ్డి ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిస్తే వారి విద్యాసంస్థలను అభివృద్ధి చేసుకోవడం తప్ప ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు. విద్యావంతులు, మేధావులంతా కలిసి సమాజానికి ఉపయోగపడే వారిని ఈ ఎన్నికల్లో ఎన్నుకోవాలన్నారు. మీలో ఒకడిగా, మీ అందరి ప్రతినిధిగా ఉంటూ శాసన మండలిలో మీ గళాన్ని వినిపించే ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి ఓటును వేయాలని కోరారు.

హలీమ్ అమ్మకాలపై జీహెచ్‌ఎంసీ నజర్..

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 25: రంజాన్ నెల ప్రారంభం కానుండడంతో హలీమ్ అమ్మకాలపై జీహెచ్ఎంసీ అధికారులు దృష్టి సారించారు. ఈ మేరకు మంగళవారం శేరిలింగంపల్లి జోన్, యూసుఫ్‌గూడతోపాటు అన్ని సర్కిళ్ల అధికారులతో సమావేశం నిర్వహించారు. హలీమ్ తయారీలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పరిశుభ్రత అంశాలపై తయారీదారులకు సూచనలు చేశారు. హలీమ్ అమ్మకాలు జరిపేటప్పుడు ట్రాఫిక్ సమస్యలు రాకుండా చూడడం, సజావుగా పంపిణీ చేయడం, నాణ్యతా ప్రమాణాలు పాటించడం వంటి నిబంధనలు పాటించాలని సూచించారు. వెటర్నరీ, సిటీ ప్లానింగ్, ఫుడ్ సేఫ్టీ, ఇతర అధికారులు పాల్గొన్నారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని మార్చి 2 నుంచి 31 వరకు వ్యాపార, వాణిజ్య సముదాయాలు 24 గంటలు తెరిచి ఉంచుకునే అవకాశాన్ని కల్పిస్తూ కార్మిక శాఖ ఆదేశాలు జారీ చేసింది.

వెటర్నరీ వీసీ జ్ఞాన ప్రకాశ్‌కు శుభాకాంక్షలు

వీసీ జ్ఞాన ప్రకాశ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న బీసీ ఉద్యోగుల సంఘం నాయకులు

వ్యవసాయ యూనివర్సిటీ, ఫిబ్రవరి 25 : పీవీ నర్సింహారావు వెటర్నరీ యూనివర్సిటీ ఉపకులపతిగా నియమితులైన జ్ఞాన ప్రకాశ్‌కు ప్రొ.జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భిక్షపతి, రాష్ట్ర నాయకులు రమేశ్, దశరథం, సంతోశ్, సందీప్, మహేశ్, రవీందర్, తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వం బీసీలకు తగు న్యాయం చేయాలని కోరారు. అనం తరం నాన్‌టీచింగ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎండీ శర్ఫొద్దీన్ ఆధ్వర్యంలో నాన్ టీచింగ్ ఉద్యోగులు బొకేలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ..ఉద్యోగుల సమష్టి కృషితోనే వర్సిటీ అభివృద్ధికి కృషి సాధ్యమవుతుందన్నారు. వర్సిటీలోని ఉద్యోగుల నియమాకాలు, కనీస సౌకర్యాలు కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై అవగాహన అవసరం

సుల్తాన్‌పల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం మ్యాప్ ద్వారా అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో మున్నీ, తదితరులు

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 25 : లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై అవగాహన అవసరమని శంషాబాద్ ఎంపీడీవో మున్నీ తెలిపారు. మంగళవారం శంషాబాద్ మండలంలోని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన సుల్తాన్‌పల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై మ్యాప్ గీసి అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఎంపిక చేసిన లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణం కోసం మ్యాప్ ఇవ్వడంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్మాణం చేసుకుంటారని వివరించారు. లబ్ధిదారులు వారికి ఉన్న స్థలంలో ఇంటి నిర్మాణం చేసుకునే విధంగా అవగాహన కల్పించినట్లు చెప్పారు. వంటగది, బెడ్‌రూంతో పాటు హాల్, బాత్‌రూం నిర్మాణం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దండు ఇస్తారి, పంచాయతీ కార్యదర్శి ప్రదీప్‌గౌడ్, నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

అదుపుతప్పి కిందపడి వ్యక్తి మృతి

బంజారాహిల్స్, ఫిబ్రవరి 25: రోడ్డుమీద నడుచుకుంటూ వెళ్తున్న ఓ వ్యక్తి కిందపడి మృతి చెందాడు. ఈ ఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. .వివరాల్లోకి వెళ్తే.. ఫిలింనగర్ ఎంఆర్‌సీ కాలనీలో నివాసం ఉంటు న్న మద్ది హుస్సేన్(55) సినిమా షూటింగ్స్‌లో లైట్‌మెన్‌గా పనిచేస్తుంటాడు. మంగళవారం ఉదయం 9గంటల ప్రాం తంలో ఇంట్లోంచి బయటకు వచ్చిన హుస్సేన్ ఇరుకైన రోడ్డుపై నడుచుకుం టూ వస్తున్నాడు. ఎత్తైన ప్రాంతం నుంచి కిందకు నడుస్తున్న క్రమంలో అదుపుతప్పి కింద పడిపోయాడు. రోడ్డుపక్కన దిగువన నిర్మాణంలో ఉన్న భవనానికి సంబంధించిన ప్రహరీలోపల పడిపోవడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. కాసేపటికి ఇంటి యజమాని అక్కడకు వచ్చి చూడగా అపస్మారక స్థితిలో ఉన్న హుస్సే న్ కనిపించగా.. వెంటనే అతడిని తీసుకువచ్చి బయట పడుకోబెట్టాడు. కాసేపటికి స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా ఫిల్మ్‌నగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు. ఎస్ఐ గణేశ్ అక్కడకు చేరుకుని పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయండి

మణికొండ, ఫిబ్రవరి 25: అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటి ంచి.. సకాలంలో పూర్తి చేయాలని మణికొండ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మణికొండ మున్సిపాలిటీలోని భాగ్యలక్ష్మి కాలనీలో సీసీ రోడ్డు పనులను మున్సిపల్ డీఈ శివసాయితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీసీ రోడ్డు పనులను త్వరితగతిన పూర్తిచేసి కాలనీవాసులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను కోరారు. వేసవికాలం ముంచుకొస్తున్న తరుణంలో తాగునీటి విషయంలో అధికారులు తగిన చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగ్యలక్ష్మి కాలనీ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, నాయుడు, మాజీ ఎంపీటీసీ రాఘవరెడ్డి, నాయకులు రవికాంత్‌రెడ్డి, భాగ్యలక్ష్మి కాలనీవాసులు పాల్గొన్నారు.

డిగ్రీ కోర్సుల పరీక్ష ఫీజు స్వీకరణ గడువు పొడిగింపు

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ డిగ్రీ కోర్సుల పరీక్ష ఫీజు స్వీకరణ గడువును పొడగించినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకామ్, బీఎస్సీ, బీఎస్సీ ఆనర్స్, బీబీఏ, బీఎస్‌డబ్ల్యూ తదితర కోర్సుల నాలుగు, ఆరో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్లాగ్ పరీక్ష ఫీజును ఈ నెల 28వ తేదీలోపు సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. రూ.500 అపరాధ రుసుముతో వచ్చే నెల 4వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను ఏప్రిల్ నెలలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే ప్రకటిస్తామని స్పష్టం చేశారు. వివరాలకు ఓయూ వెబ్సైట్లో చూసుకోవచ్చని సూచించారు.

స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

కొండాపూర్ : ప్రభుత్వం టీఎస్ ఈ-పాస్ స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థి సంఘం డిమాండ్ చేసింది. కాం గ్రెస్ ప్రభుత్వ హయాంలో విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందేలా చూడడంలో నేషనల్ స్టూడెంట్ యూనియన్ ఆఫ్ ఇండియా విఫలమైంది. మూడేండ్లుగా బీసీ విద్యార్థులు ఎదురుచూస్తుండగా, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రెండేండ్లుగా అందుకోలేనట్లు స్టూడెంట్ యూనియన్ ప్రతినిధులు పేర్కొన్నారు.

తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు

జలమండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మయాంక్ మిట్టల్

అధికారులకు సూచనలిస్తున్న జలమండలి ఈడీ మయాంక్ మిట్టల్

ఎర్రగడ్డ, ఫిబ్రవరి 25: వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా తీసుకోవాల్సిన చర్యల గురించి ముందస్తు ప్రణాళికలు పాటించాల్సిన అవసరం ఉన్నదని జలమండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మయాంక్ మిట్టల్ పేర్కొన్నారు. కిందిస్థాయి అధికారులతో కలిసి ఆయన మంగళవారం జలమండలి ఎర్రగడ్డ సెక్షన్ పరిధిలో పర్యటించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. సిబ్బంది నిత్యం తమ తమ ప్రాంతాల్లో పర్యటించి పైప్‌లైన్ లీకేజీలను గుర్తించాలని.. నీటి వృథాను అస్సలు కానివ్వరాదని అన్నారు. అవసరమైన ఏరియాలకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాకు సిద్ధంగా ఉండాలని అన్నారు. జలమండలి కి చెందిన ఫిల్లింగ్ సెంటర్ల వద్దకు ట్యాంకర్లను తీసుకెళ్లి ఎటువంటి ఇబ్బందులు ఏర్పడకుండా చూడాలన్నారు. ఈడీ వెంట జీఎం హరిశంకర్, డీజీఎం హమీద్ అబ్దుల్ వాహబ్, ఎర్రగడ్డ సెక్షన్ మేనేజర్ ప్రేమ్ కుమార్, వివిధ సెక్షన్ల మేనేజర్లు జయప్రకాశ్, సూర్యప్రకాశ్, రాంబాబు, రాజేందర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ షకీలుద్దీన్, తదితరులు ఉన్నారు.

విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

పశువైద్య విశ్వవిద్యాలయం వీసీ జ్ఞాన ప్రకాశ్

క్రీడల అనంతరం వీసీ జ్ఞాన ప్రకాశ్‌తో విద్యార్థులు

వ్యవసాయ యూనివర్సిటీ, ఫిబ్రవరి 25: విద్యతోపాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించాలని పీవీ నర్సింహారావు పశువైద్య విశ్వవిద్యాలయం ఉపకులపతి డా.జ్ఞానప్రకాశ్ అన్నారు. మంగళవారం మూడవ ఇంటర్ కాలేజ్ క్రీడా సాహితి , సంస్కృతిక పోటీలు ముగింపు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం క్రీడా మైదానంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ప్రతి మనిషిలో పోటీతత్వం ఉన్నప్పుడే ఉత్తమ లక్ష్యాలకనుగుణంగా పనిచేయగలరన్నారు. ఒకేసారి సాధించకపోయినా ధృడ సంకల్పంతో కృషి చేస్తూనే ఉండాలని అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు, క్రీడల్లోనూ రాణించాలని.. అప్పుడే చురుకుగా, ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇష్టమైన ఏదేని ఆటలో పాల్గొనాలన్నారు. గెలుపు, ఓటములు సహజమన్నారు. క్రీడల్లో పాల్గొన్న ప్రతి విద్యార్థి నిని అభినందించారు. రిజిస్ట్రార్ శరత్‌చంద్ర మాట్లాడుతూ.. క్రీడలు మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించడానికి ఎంతో దోహదపడుతాయన్నారు. విద్యార్థులకు, సిబ్బందికి చదువు తో పాటు , శారీరక ధృడత్వం ఎంతో అవసరమన్నారు . తమకు నచ్చిన క్రీడల్లో పాల్గొని క్రీడాస్ఫూర్తిని ఆస్వాదించాలని సూచించారు. క్రీడల్లో రాణించిన విద్యార్థులకు పురస్కా రాలు అందించారు. డా.సతీశ్, డా.మాధురి, తదితరులు పాల్గొని పలు సూచనలు చేశారు. వర్సిటీ పరిధిలోని రాజేంద్రనగర్, మామునూర్, కోరుట్ల, కామారెడ్డి, పెబ్బేర్, కళాశాలలనుంచి 250 మంది విద్యార్థినీ విద్యార్థులు, బోధన సిబ్బం ది , బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

మహాశివరాత్రి మహోత్సవాలు ప్రారంభం

చిన్న అనంతగిరి శివాలయంలో నిర్వహించిన మహాశివరాత్రి మహోత్సవ పూజల్లో రాజేంద్రనగర్ ఏసీపీ శ్రీనివాస్, తదితరులు

మైలార్‌దేవ్‌పల్లి, ఫిబ్రవరి 25: అత్తాపూర్ డివిజన్, రాంబాగ్‌లోని చిన్న అనంతగిరి శివాలయంలో మహాశివరాత్రి మహోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. హైదర్‌గూడ శ్రీ ప్రణవ భక్త సమాజం ఆధ్వర్యంలో ఉదయం దేవా లయంలో సుప్రభాత సేవ, గణపతి, అమ్మవారికి, స్వామివారికి అభిషేకాలు, గణపతి హోమం, శ్రీ ఉమామహేశ్వరి అమ్మవారికి కుంకుమార్చన, నవగ్రహ విశేష పూజలు, గీతా పారాయణం, తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ మహోత్సవాలకు రాజేంద్రనగర్ డివిజన్ ఏసీపీ శ్రీనివాస్, తదితరులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో సమాజం అధ్యక్షుడు మోంద్ర నర్సింహ, ఉపాధ్యక్షులు సనివెళ్లి కృష్ణ, నారగూడెం మల్లారెడ్డి, మద్దూరి బాల సుబ్రహ్మణ్యం, రావుల జగన్, తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఏర్పాట్లు

మణికొండ, ఫిబ్రవరి 25 : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ పార్వతీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా మంగళవారం మణికొండ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కొండకళ్ల నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు చేపట్టారు. బుధవా రం ఉదయం నుంచి రాత్రి వరకు దాదా పు పదివేల మందికి పైగా భక్తులు హాజరై స్వామివారి కల్యాణంలో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రాజేందర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి యాలాల నరేశ్, కోశాధికారి రాఘవరెడ్డి, ఆలయ కమిటీ ప్రతినిధులు సురేందర్ రెడ్డి, రవి, కాంత్ రెడ్డి, ఆలయ ప్రధాన అర్చకు లు మల్లికార్జున శర్మ పాల్గొన్నారు.

- బంజారాహిల్స్, ఫిబ్రవరి 25: మహ శివరాత్రి పర్వదిన వేడుకలకు సర్వం సిద్ధమయింది. ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల్లో బుధవారం జరగనున్న శివరాత్రి వేడుకలకు ఆలయాలు ముస్తాబయ్యాయి. శ్రీనగర్ కాలనీలోని శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో, బంజారాహిల్స్ రోడ్ నం1లోని శివాలయం, ఫిల్మ్‌నగర్ దైవసన్నిధానం, ఎన్‌బీటీనగర్‌లోని శివాలయం, తదితర ఆలయల్లో వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆలయాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

మహిళ కారు ధ్వంసం

బంజారాహిల్స్, ఫిబ్రవరి 25: అకారణంగా మహిళను దుర్భాషలాడడంతో పాటు కారును ధ్వంసం చేసిన గుర్తుతెలియని వ్యక్తిపై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే..బంజారాహిల్స్ రోడ్ నం.4లో నివాసం ఉంటున్న రయాద్ ఫారూఖ్ భార్య.. తన స్నేహితురాలితో కలిసి ఈనెల 20న కారులో బయటకు వెళ్తున్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తి అడ్డుకున్నాడు. అకారణంగా ఆమెను తీవ్ర పదజాలంతో దూషించడంతో పాటు కారు అద్దాలను రాడ్‌తో ధ్వంసం చేశాడు. కారును ముందుకు తీసుకువెళ్లేందుకు ప్రయత్నించినా వినకుండా బూతులు తిట్టాడు. దీంతో తీవ్ర భయాందోళనకు గురయిన బాధితురాలు స్థానికుల సాయంతో అక్కడినుంచి తప్పించుకుని వచ్చింది. ఈమేరకు మహిళ భర్త ఫారూఖ్ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఫ్లాట్ డోర్ ఎందుకు కొట్టావంటూ దాడి..

బంజారాహిల్స్,ఫిబ్రవరి 25: అపార్ట్‌మెంట్‌లోని తన ఫ్లాట్ డోర్ ఎందుకు కొట్టావంటూ పక్కింట్లోని వ్యక్తిని చితకబాదిన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే .. వెంకటగిరిలోని శివాస్ దివ్యా హైట్స్ అపార్ట్‌మెంట్స్‌లోని ఫ్లాట్‌లో కుటుంబంతో సహ విక్రమ్ అనే వ్యక్తి నివాసం ఉంటారు. మంగళవారం ఉదయం ఇంట్లోంచి బయలుదేరిన సమయంలో ఎదురింట్లో ఉంటున్న మహిళ డస్ట్‌బిన్‌తో బయటకు వచ్చింది. చెత్త రిక్షా వచ్చిందని గట్టిగా తలుపులు కొట్టి చెప్పింది. అయితే మరో ఫ్లాట్‌లో నివాసం ఉంటున్న హకాన్ అనే వ్యక్తి బయటకు వచ్చి విక్రమ్‌తో గొడవకు దిగాడు. తన తలుపు ఎందుకు కొట్టావంటూ ఆగ్రహంతో బూతులు తిట్టాడు. తాను కొట్టలేదని చెప్పినా వినిపించుకోకుండా విక్రమ్‌పై దాడికి దిగాడు. మరోసారి ఫ్లాట్ వద్ద ఎలాంటి శబ్దం చేసినా చంపేస్తానంటూ హెచ్చరించాడు. ఈ మేరకు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేపట్టారు.

లింగంపల్లి రైల్వేస్టేషన్ పరిశీలన

శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 25 : దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ మంగళవారం సాయంత్రం లింగంపల్లి రైల్వే స్టేషన్‌ను సందర్శించారు సౌకర్యాలు, వసతులు, ప్రయాణికుల ఇబ్బందులు , ప్లాట్ ఫాంల వివరాలు, పార్కింగ్ సదుపాయాలను పరిశీలించారు.